## నిబద్ధతతో పనిచేయాలి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

సిటీ బ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా నిబద్ధతతో పనిచేస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టరేట్‌లో పోలీస్ గౌరవ వందనాన్నిస్వీకరించారు. అదనపు కలెక్టర్లు పలని, డాక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 2: విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డాక్టోరల్ కోర్సులను అభ్యసించడానికి స్కాలర్ షిప్ (ఆర్థిక సహాయం) మంజూరు కోసం అర్హత కలిగిన మైనారిటీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కాంతమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయాలలో పీజీ, డాక్టోరల్ కోర్సులలో 01.01.2025 నుంచి 30.06.2025 వరకు ప్రవేశం పొంది అన్ని అర్హత ప్రమాణాలను పూర్తిచేసిన విద్యార్థులు www.telanganaepass. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మైనార్టీ కార్యాలయంలో లేదా 94920 37940, 90001 68256 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఈ కామర్స్‌కు కిరాణా కుదేలు

- పుట్టగొడుగుల్లా క్విక్ కామర్స్ యాప్‌లు
- ఆన్‌లైన్ ఆర్డర్లకు అలవాటుపడుతున్న జనం
- నగరంలో పెరిగిపోతున్న ఆన్‌లైన్ సరకుల డెలివరీ
- కనుమరుగవుతున్న కిరాణా దుకాణాలు



సిటీ బ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకునే చిరు వ్యాపారుల పాలిట క్విక్ కామర్స్ డెలివరీ సంస్థలు శాపంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ డెలివరీల పేరిట కొనుగోళ్లు తగ్గిపోయి కాలనీల్లోని కిరాణా దుకాణాలు వెలవెలబోతున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న క్విక్ కామర్స్ యాప్‌లు చిరు వ్యాపారులకు ఉపాధి లేకుండా చేస్తున్నాయి. గిరాకీలు తగ్గడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని దుకాణాల నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడేండ్లుగా దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కరోనా మహమ్మారి సృష్టించిన అలజడికి నగరంలోని ఇంటి అద్దెలతో పాటు అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో అన్నింట్లోకి ఆన్‌లైన్ డెలివరీ విధానం వచ్చింది. దీంతో పాల ప్యాకెట్ల నుంచి మాంసం ఉత్పత్తుల దాకా అన్నీ ఆన్‌లైన్ బుకింగ్స్‌తో ఇంటి వద్దకే వచ్చేంతగా మారిపోయింది. దీని ప్రభావం అన్నింటి కంటే కిరాణా దుకాణాలపై తీవ్రంగా పడింది. చేసేదేమీ లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో నగరంలోని చాలా కాలనీల్లో ఉన్న చిన్న చిన్న దుకాణాలను మూసేస్తున్నారు.

### 10 నిమిషాల్లో సరుకులు..

ఆన్‌లైన్ క్విక్ కామర్స్ యాప్‌లు వచ్చిన తర్వాత ప్రజలు కిరాణా దుకాణాలకు వెళ్లడం పూర్తిగా తగ్గించేశారు. సరకులను ఆర్డర్ చేసిన 10 నిమిషాల్లోనే ఇండ్లకు చేరుతుండటంతో ఆన్‌లైన్ విధానం వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. తక్కువ సమయంలో ఇండ్లకు చేర్చడంతో పాటు ఆఫర్ల పేరిట దుకాణాల్లోని ధరల కంటే తక్కువకే ఇస్తున్నారు. దీంతో ప్రజలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేందుకే ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. మరోవైపు తొలిసారి బుక్ చేసుకున్నవారికి క్యాష్ బ్యాక్, ప్రత్యేక ఆఫర్లను అందిస్తుండటంతో వినియోగదారులు క్విక్ కామర్స్ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారు. ధరలు కూడా అందుబాటులో ఉండటం, సమయం ఆదా అవుతుండటంతో దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని వినియోగదారులు భావిస్తున్నారు. అయితే ఈ పరిణామాలు కిరాణా దుకాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

### మాల్‌లు, సూపర్ మార్కెట్ల ప్రభావం అదనం..

గ్రేటర్ హైదరాబాద్‌లో పుట్టుకొస్తున్న మాల్‌లు, సూపర్ మార్కెట్లు కూడా కిరాణా దుకాణాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. సూపర్ మార్కెట్లలో నిత్యావసర సరకులు తక్కువ ధరలకు లభిస్తాయనే భావనతో వినియోగదారులు నెలకు సరిపడా సరకులను తీసుకునేందుకు వాటిపైనే ఆధారపడుతున్నారు. అదేవిధంగా కిరాణా సరకులతో పాటు దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు ఇలా అన్నిరకాల వస్తువులు తక్కువ ధరతో పాటు ఒకేచోట సూపర్ మార్కెట్లలో ఉండటంతో ప్రజలు వాటివైపు కూడా మొగ్గు చూపుతున్నారు. దీంతో కిరాణా దుకాణాలకు వచ్చే వారి సంఖ్య పడిపోయింది.

### 50 శాతం తగ్గిన గిరాకీ



మణికొండలో ఎనిమిదేండ్ల నుంచి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాం. కరోనా మహమ్మారికి ముందు మంచి లాభాలు వచ్చేవి. మూడేండ్ల నుంచి లాభాలు 50 శాతం కిందకు పడిపోయాయి. దానికి తోడు రెంట్లు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో దుకాణం నిర్వహణ భారంగా మారుతోంది. దుకాణం అద్దె, ఇంటి అద్దెలు, పెరిగిన ఖర్చులతో వచ్చిన లాభం ఏ మూలనా సరిపోవడం లేదు. ఆన్‌లైన్ యాప్‌లు వచ్చిన తర్వాత వినియోగదారులు దుకాణాలకు రావడం లేదు. యాప్‌ల వాళ్లు ఆఫర్లు, తక్కువ ధరల పేరుతో ఆకర్షించడంతో వినియోగదారులు క్వాలిటీని చూడటం లేదు. తక్కువ ధరకు వచ్చాయనేదే చూస్తున్నారు. దీంతో మా వ్యాపారం పూర్తిగా తగ్గిపోయింది. దుకాణాలు మూసేసుకుని ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం ఆన్‌లైన్ కొనుగోళ్లకు అడ్డుకట్టవేయాలి.

– వినోద్, కిరాణ దుకాణందారుడు, మణికొండ

## న్యూయార్క్‌లో ఆవిర్భావ సంబురం

సిటీ బ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలతో పాటు బాలోత్సవ్‌ను నిర్వహించారు.బెత్ పేజ్ కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన ఈ ఉత్సవాలకు తెలుగు ప్రవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నైటా అధ్యక్షురాలు వాణి అనుగు, కార్యవర్గ సభ్యులు అభివృద్ధి పథంలో పయనిస్తున్న తెలంగాణ మరింత ఎదగాలని ఆకాంక్షించారు. సింగర్స్ సృష్టి చిల్ల, వందేమాతరం తరంగ్ తమ ఆటపాటలతో అలరించారు. నృత్యాలు, పాటలు, మ్యాజిక్ షో, మిమిక్రీ సహా పలు రకాల పోటీలు ఉత్సవాలకు ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎన్నారై పైళ్ల మల్లారెడ్డి, నైటా వైస్ ప్రెసిడెంట్ రవీందర్, సెక్రటరీ హరిచరణ్ బొబ్బిలి, ట్రెజరర్ నరోత్తం రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ డాక్టర్ రాజేందర్ రెడ్డి జిన్నా, లక్ష్మణ్ రెడ్డి అనుగు, అడ్వైజరీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బల్దియాలో మాన్‌సూన్ టెండర్లు రద్దు

నమస్తే తెలంగాణ, జూన్ 2: మాన్‌సూన్ టెండర్ల విషయంలో జీహెచ్‌ఎంసీ వెనక్కి తగ్గింది. మరమ్మతుల పేరిట ప్రభుత్వ ఖజానాకు గండికొట్టేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలతో ఉన్నతాధికారులు టెండర్లను రద్దు చేశారు. వర్షాకాల అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాలకు సంబంధించిన టెండర్ నోటిఫికేషన్లతో స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతుందని, ప్రజాధనం కొల్లగొట్టేలా టెండర్ల నిబంధనలు ఉన్నాయని, అధికారులకు నచ్చిన సంస్థలకు పనులు కట్టబెట్టే వీలు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత టెండర్లను రద్దు చేయగా.. జోన్లవారీగా టెండర్లు పిలిచే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. వానకాల అత్యవసర బృందాలు, సత్వర మరమ్మతు బృందాలకు పాత విధానంలో పనులు చేపట్టనున్నట్లుగా సమాచారం.

## జేఈఈలో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



అశోక్



రాజశేఖర్

శేరిలింగంపల్లి, జూన్ 2: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర గౌలిదొడ్డి కళాశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు. 80 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 21 మంది విద్యార్థులు డైరెక్ట్ ర్యాంకులు, 19 మంది విద్యార్థులు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించారు. ఆర్ అశోక్ 82వ ర్యాంకు, ఏ రాజశేఖర్ 162, ఏ శివమణి 1,150, పీఏవీ శ్రీనివాస్ 1356, పీ విజ్వల్ సింహా 1,632, ఎం పవన్ దీప్ 1,776, పీ భాను తేజ 1,995వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకుల కార్యదర్శి అలుగు వర్షిని, సంయుక్త కార్యదర్శులు, స్టేట్ ఆఫీసర్ భీమయ్య, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, వైస్ ప్రిన్సిపాల్ గణేష్ అభినందించారు.




## ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం

**మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్**

**ఆస్ట్రేలియాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హాజరు**

బేగంపేట్ జూన్ 2: మెల్‌బోర్న్‌లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని అన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తోందని.. అన్నివర్గాల వారు నిరాశ నిస్పృహలో ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి కిరణ్ యాదవ్, యూత్ వింగ్ నాయకుడు వినయ్ సన్నీ, బీఆర్ఎస్ నాయకులు.. ఉదయ్ సింహా రెడ్డి, సతీష్ పులిపాక, కత్తుల వినోద్, హర్ష, సాయికృష్ణ కల్వకుంట్ల, అశోక్ ఈగ, తెలుగు ఎన్ఆర్ఐలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## అబుదాబిలో ఆవిర్భావ వేడుకలు

అబుదాబిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. అబుదాబి తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాన్సులర్ శ్రీ ప్రేం చంద్, ఆయుషి సుతారియా ముఖ్య అతిథులుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా జానపద నృత్యాలు, పేరిణి శివతాండవం, గుస్సాడి నృత్యాలతో కళాబృందాలు అలరించాయి.

## 2 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత..

సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు తాజాగా మరో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టును రట్టు చేశారు. ఈ కేసులో రూ.2కోట్ల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఒక యువతితో పాటు ఏపీకి చెందిన ఒక కానిస్టేబుల్ సహా మొత్త ఐదుమంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.... కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ కాలనీ ప్రాంతంలో ఒక ముఠా డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఐదుమంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుల వద్ద రూ.2కోట్ల విలువ చేసే 841గ్రాముల కొకైన్, కొకైన్ మిక్చర్ డ్రగ్స్ లభించినట్లు తెలిసింది. అరెస్టు చేసిన వారిలో యువతితో పాటు ఏపీలోని తిరుపతి ప్రాంతానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ కూడా ఉన్నటు సమాచారం.

### మల్కాజిగిరిలో ..

డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 2.4గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను పట్టుకున్నా రు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన ప్రేమ్‌కుమార్, శరత్‌కుమార్‌లు బెంగుళూరుకు చెందిన నితీష్‌అరుణ్‌రాజ్ వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి.. నగరంలో విక్రయిస్తారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు సోమవా రం మల్కాజిగిరి ప్రాంతంలో డ్రగ్స్ విక్రయించేందుకు యత్నిస్తున్న ప్రేమ్‌కుమార్, శరత్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 2.4గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న నితీశ్‌అరుణ్‌రాజ్‌పై కేసు నమోదు చేశారు.




సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందు సందర్భంగా ప్రపంచ సుందరి సంచాత చువాంగ్ శ్రీని అభినందిస్తున్న యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ దశరథరామిరెడ్డి, డాక్టర్ సంజోగ్ మాథుర్



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. చెరువులు, నాలాలు, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడడం కోసం హైడ్రాను ఏర్పాటు చేశారని, ఆ దిశగా ఔటర్‌రింగ్‌రోడ్డు లోపల హైడ్రా పనిచేస్తున్నదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనేకమంది ప్రాణాలు అర్పించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. - సిటీబ్యూరో

## క్షయ రహిత సమాజమే ధ్యేయం

**జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి**

సిటీబ్యూరో, జూన్ 2, (నమస్తే తెలంగాణ): క్షయ రహిత సమాజమే ధ్యేయమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి పేర్కొన్నారు. టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభు త్వం చేపట్టిన 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'ను సోమవారం హైదరాబాద్ జిల్లాలోని సికింద్రాబాద్‌లో ఉన్న హమాలీ బాధి టీబీ యూనిట్‌లో ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో టీబీ నిర్మూలన దిశగా మేం వేగంగా పనిచేస్తున్నాం... అతి తక్కువ సమయంలో లక్షణాలను గుర్తించి, సరైన చికిత్స అందించింది ప్రాణాలు కాపాడుతున్నాం.. రెండు వా రాల కన్నా ఎక్కువ దగ్గు, ఛాతిలో నొప్పి, రక్తంతో దగ్గు, బరువు తగ్గడం, రాత్రి చెమటలు, ఆకలి తగ్గడం, శ్వాసలో ఇబ్బంది, మెడలో ఉబ్బిన గ్రం థులు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య సల హా తీసుకోవాలి.. అధునాతన పరీక్షలు , నిక్-క్షయ్ మిత్రా కార్యక్రమం ద్వారా పోషకాహార మద్దతు, డోర్ టు డోర్ స్క్రీనింగ్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా టీబీ బాధితులకు నెలకు రూ.1000 అందించనున్నారు.. నిక్-క్షయ్ పోర్ట ల్ ద్వారా రోగుల చికిత్సను నిత్యం పర్యవేక్షించనున్నారు... ప్రజలు నిక్-క్షయ్ మిత్రలుగా చేరి టీబీ నిర్మూలనలో భాగస్వాములు కావాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. చలాదేవి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.శ్రీకాంత్, డా.సాయిబాబు, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డా. మహేశ్, టీబీ మెడికల్ ఆఫీసర్ డా. సరిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తెలంగాణ హోంశాఖలోని అన్ని విభాగాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డీజీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం సీఐడీ, కోఆర్డినేషన్ ఇన్‌చార్జి ఐజీ శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏసీబీ కార్యాలయంలో ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, పోలీస్ అకాడమీలో ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ మురళీధర్, జైళ్లశాఖ, ఎక్సైజ్, ఉమెన్ సేఫ్టీవింగ్ కార్యాలయాల్లో అధికారులు , హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులర్పించారు. - హైదరాబాద్

## బాబా ఆచూకీ ఎక్కడ..?

**ఐదు రోజులు గడిచినా పట్టుకోలేకపోయిన పోలీసులు**

సిటీ బ్యూరో, జూన్ 2 : అరాచకాలు, ఆగడాలు, దౌర్జన్యాలతో ప్రజల్ని భయకంపితుల్ని చేసి ఆత్మహత్యలకు కారణమవుతున్న బోరబండ కార్పొరేటర్ బాబా ఆచూకీ పోలీసులకు ఇప్పటికీ లభ్యం కాకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. బీఆర్ఎస్ బోరబండ మైనార్టీ డివిజన్ నాయకుడు మహ్మద్ సర్దార్ ఆత్మహత్యకు కారకుడైన బాబాను పోలీసులు పట్టుకోవడంలో జరుగుతున్న జాప్యంపై బాధిత కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. కేసు నమోదై 5 రోజులు గడిచినా అతను ఎక్కడున్నాడో ఇప్పటికీ పోలీసులు కనిపెట్టలేకపోవడంపై విమర్శలకు తావిస్తున్నది.

**కాంగ్రెస్ కార్పొరేటర్‌ను కాపాడుతున్నదెవరు..?**

**కేసుపై కమ్ముకుంటున్న నీలినీడలు**



### కాంగ్రెస్ కార్పొరేటర్ బాబాను కాపాడుతున్నదెవరు..?

దౌర్జన్యాలు.. దాదాగిరి, బెదిరింపులకు పాల్పడే బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ను ఎవరు కాపాడుతున్నారు? అతని వెనుక ఏ శక్తులు పనిచేస్తున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ లోకి ఫిరాయించిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇంకా అరెస్ట్ కాకపోవడంతో అనుమానాలు బలపడ్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల ఒత్తిడితోనే బాబాని అరెస్ట్ చేయకుండా ఖాకీలు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ బోరబండ మైనారిటీ విభాగం నాయకుడు మహ్మద్ సర్దార్ ఆత్మహత్యకు కారణమైన కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, అతని భార్య హబీబా సుల్తానా, కార్పొరేటర్ పీఏ సప్తగిరి ల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్తున్నారు. ఈ ఐదు రోజులుగా ఈ కేసులో నిందితులు కార్పొరేటర్ బాబా, అతని భార్య హబీబా సుల్తానా, కార్పొరేటర్ పీఏ సప్తగిరిలు ఎక్కడున్నారు? వారికి ఆశ్రయం ఎవరిచ్చారు? నిందితులు ఫోన్లు వాడుతున్నారా? ఒకవేళ వాడితే వారి సెల్ ఫోన్ సిగ్నల్స్ ను ఎందుకు ట్రేస్ చేయలేకపోతున్నారు? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఐదు రోజుల నుంచి పోలీస్ బృందాలు గాలిస్తున్నా..బాబా చిక్కకపోవడానికి కారణమేంటి ? పోలీసులు అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి కేసు దర్యాప్తులో కావాలనే జాప్యం చేస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ కేసులో స్వాధీనం చేసుకున్న సర్దార్ ఫోన్ ను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపారు. కార్పొరేటర్ బాబా బ్లాక్ మెయిలింగ్ కు సంబంధించిన క్లూస్ సేకరించాలని ఫోరెన్సిక్ ల్యాబ్ కు పోలీసులు పంపారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం విశ్లేషించి ఇచ్చే నివేదిక కీలకంగా మారుతుందని పోలీసులు భావిస్తున్నారు.

## హైడ్రా ప్రజావాణికి 23 ఫిర్యాదులు

సిటీబ్యూరో, జూన్ 2(నమస్తే తెలంగాణ): నాలాలు, చెరువుల ఆక్రమణలపై హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు లు వచ్చాయి. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 23 ఫిర్యాదులు అందాయని హైడ్రా సిబ్బం ది తెలిపారు.

తిరుమలగిరి భూదేవినగర్‌లోని సాయిదత్తాగార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ గ్రామంలో 11జ20,11జ21 సర్వే నంబర్లలో గురుకుల ట్రస్ట్‌లో లేఔట్ వేశారని, ఇందులోని ప్లాట్లతో పాటు రహదారులు కూడా కబ్జాకు గురయ్యాయని తెలిపారు. బేగంపేటలోని చీకోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్ట్‌మెంట్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోంది... వరదనీరు చేరకుండా చూడాలని అపార్ట్‌మెంట్‌వాసులు ఫిర్యాదులు చేశారు. కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతోపాటు ఈ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నా లా కూడా కబ్జా జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా వెళ్ళే లా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను హైడ్రా అడిషనల్ కమిషనర్ పాపయ్య స్వీకరించి పరిశీలించారు.

## ' భూభారతి'లో పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు

**నేటినుంచి జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు..సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్ నారాయణరెడ్డి**

రంగారెడ్డి, జూన్ 2 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డిజిల్లాలో నేటినుంచి నిర్వహించే భూభారతి గ్రామసభల్లో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుచేస్తే సహించేది లేదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సంబంధిత అధికారులు కావాలని పొరపాట్లు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని, అవసరమనుకుంటే సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడమని ఆయన హెచ్చరించారు. మంగళవారం నుంచి జరుగనున్న భూ భారతి గ్రామసభల్లో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి దరఖాస్తు ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాలని, దరఖాస్తు దారులు తిరిగి అప్పీల్‌కు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకనుగుణంగా విచారణ జరిపించాలని ఆయన సూచించారు. సాదాబైనామాలు, పీఓటీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన ప్రభుత్వం వ్యవహరించే మార్గదర్శకాలను అనుసరిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. సుమారు 20రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఇప్పటికే రంగారెడ్డిజిల్లాలోని కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిపి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. అదే తరహాలో జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల వారీగా సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 3నుంచి కొనసాగనున్న రెవెన్యూ సదస్సులు ప్రతిరోజు ఉదయం 9గంటలకు ప్రారంభం కావాలని, సాయంత్రం వరకు అధికారులంతా అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.